# తొలగిన మబ్బులు

చిన్నతనంలో తన మంచం, రాధ మంచం ప్రక్క ప్రక్కల్ని వేసి వున్నపుడు యింట్లో అందరి అలికిడీ తగ్గిన తర్వాత ఆ చీకట్లో ఎదురుతూ, బెదురుతూ చెయ్యి చెయ్యి కలుపుగొని ఆలోచిస్తూ - రాధ ఏం చేస్తుందో ! ఏమనుకుంటూందో ! తెలుసుకుందికి కదలి కదలనట్టు ఆమె వైపు తను చూసినపుడు, ఆ సమయానికే ఆమె కూడా తనని చూడగా యిద్దరూ అదోలా అయిపోయి ఎవరికి వారే నిద్రలో వున్నట్టు నటిస్తూ అలా తను ఎందుకు చేస్తున్నాడో, ఏమిటో ? ఆ చిన్నతనంలో తనకు తెలియకపోయినా - అదో రకం ఆనందం అనుభవించిన రోజులూ - రాధ వ్యక్తురాలయినపుడు ఆమెను దూరం నుంచి తడబడుతూ చూసినపుడు తలవంచుకొని సిగ్గుతో ఆమె తనని చూసి నవ్విన నవ్వు ! - ''మేనరికం పుట్టినే పోనిస్తావా ?'' అన్న మావయ్య మాటలూ - యివన్నీ ఆనాడు అక్కడ అనుకోకుండా రాధని చూసినపుడు కృష్ణకి జ్ఞాపకానికి వచ్చాయి.

అంత అకస్మాత్తుగా చూడడం వల్ల ఆమె రాధ అవునా, కాదా ? అని సందేహిస్తూ నిలబడిపోయాడు. ఈయన్ని చూసి రాధ కూడా రెండడుగులు ముందరికి వేసి లోపలికి రమ్మని పిలిచింది.

కృష్ణ వెళుతూనే, ''మీ ఆయనకిక్కడ ఉద్యోగమా ?'' అని అడిగేడు కుర్చీలో కూర్చుని.

''అవును. వచ్చి రెండు వారాలే అయింది'' అని రాధ జవాబు చెప్పింది. కాని కృష్ణ యీ మాటలు అంతలా వినలేదు. ఆమెని చూశాక చిన్నతనంలోని విషయాలు ఒక్కొక్కటీ కంటికికి కట్టినట్టు అవుపిస్తున్నాయి.

నాన్నగారు చనిపోయినప్పటినుండి తను, అమ్మ తాతయ్య గారింట్లోనే వుంటున్నారు. తాతయ్య, అమ్మమ్మ కూడా చనిపోగానే వేరే యింట్లోకి వెళ్లిపోవలసి వచ్చింది. ఈ స్వల్ప విషయమే యింతవనీ చేసింది. ఇంట్లో వున్న ఆస్తినంతటినీ చేత చిక్కించుకొని మకాం ఎత్తేసేరని మావయ్యకి అనుమానం కలిగింది. చెప్పుడు మాటల వల్లనైతేనేమి, దురదృష్టం వల్లనైతేనేమి యిది రాను రాను జట్టీల వరకూ వచ్చి ఆఖరికి మొహాలు చూసుకుంటే మైలపడతారేమో అన్నంత అయిష్టత వరకూ దారితీసింది. ప్రస్తుతం ''వాళ్లకి వీళ్లెంతో - వీళ్ళకి వాళ్ళూ అంతే'' అన్నట్టయింది. వంశపారంపర్యంగా రక్తంలో ప్రవహించే అభిమానం ; కొన్ని మాటల వల్ల, కొన్ని అపోహల వల్ల, మరికొన్ని అనుమానాల వల్ల - కనబడకుండా పోతూందే. తరతరాల నుండీ వస్తూన్న ప్రేమ, తాత్కాలికమైన తప్పుల వల్ల అంతరించి పోతూందే ! - యింతేనా బంధువుల మధ్య వున్న బాంధవ్యం... అలా అయితే రాకపోకలెందుకు ?

ముఖం ముందు ఆ పలకరింపులు - ముఖప్రీతి మాటలు - యివన్నీ ఎందుకు? తనకు ఇంపుగా తోచినంతకాలం ముందు చెప్పిన, - పొగిడిన మాటలే నిజమయినవా ? తనకు చెడ్డ అని తోచిన వెంటనే ఆ అభిప్రాయం ఒక్క క్షణంలో మార్చుకొని వారినే నానా మాటలూ ఆడుతూ లేనిపోనివన్నీ కలిపించి చెబుతున్న మాటలే నిజమయినవా ? ఏవి అసత్యమయినవి? యివన్నీ పట్టింపు వెనకం వల్లనే జరుగుతున్నాయని అనుకున్నాడు. వీటివల్లనే తనకీ, రాధకీ ఎడబాటు జరిగింది. యీ కావేషంతో బంధుత్వమే మరిచిపోతారని అనుకోలేదు. యీ పట్టింపులు ఎంతటికయినా దారితీస్తాయని యిప్పుడు తెలుసుకున్నాడు కృష్ణ. యిలా ఆలోచిస్తూ వుండిపోగానే-

''ఏమిటలా ఆలోచిస్తున్నావు ?'' అని రాధ అడిగింది. దానికి కృష్ణ యిటు తిరిగేడు -

''ఏమిటన్నావూ ?''

''ఏమిటి అంత దీక్షగా ఆలోచిస్తున్నావని !'' రాధ అన్న యీ మాటల్లో పూర్వపు ధోరణి మాత్రం మారలేదు.

''అబ్బే ఏమీ లేదు.''

''ఏమీ లేకపోవడం ఏమిటి - నాలుగుసార్లు పిల్చినా పలకకుండ అలా పరధ్యానంగా వున్నావే!''

''విశేషం ఏమీ లేదు, అకస్మాత్తుగా యిలా నిన్ను చూడ్డం చేత ...''

''- ఆఁ - చూడ్డంచేత .... ! చెప్పు''

''మరేం లేదు అంతే ...'' అని కృష్ణ కొంచం నవ్వగానే -

''అవును... నీ దాపరికం పోయిందికాదు. జ్ఞాపకం వుందా .. నేనెప్పుడయినా కొంచం పరధ్యానంగా వున్నట్టయితే... వున్నది వున్నట్టు చెప్పినా వదిలేవాడివి కాదే.... మరి అలా నాకు మాత్రం తెలుసుకోవాలని వుండదా ఏమిటి ?'' అని అడిగింది.

రాధ యింకా యింత చనువుగా మాటాడుతుందని అనుకోలేదు.

''ఏమీలేదు... మనవాళ్ల జట్టీలు మనల్ని ఎంతవరకూ తీసుకువచ్చాయా... అని ... ఆలోచిస్తున్నాను... అయినా .... అవన్నీ యిప్పుడెందుకులే -'' అని అతడు అనగానే రాధకి ఆ విషయాలన్నీ జ్ఞాపకానికి రాక తప్పేయి కాదు. యీ జట్టీలు తమ యిద్దరి మధ్యా ముసలంలా సంభవించాయి. తను కృష్ణని మనస్సాక్షిగా ప్రేమించింది. అగ్నిసాక్షిగా వివాహం జరుగుతుంది గదా అని పొంగిపోయింది. ఎన్నోసార్లు అతడిని తల్చుకుని అదో విధమయిన ఆనందంలో మునిగిపోయేది. తనకోసం తనవాళ్లు పై సంబంధాలకోసం చూస్తూంటే మహా దుఃఖం వచ్చేది. అందుచేతనే తనను చూడడానికి పెళ్ళివారు వచ్చినపుడు తనకు నచ్చలేదని సిగ్గు, లజ్జ విడిచి కచ్చితంగా చెప్పేసింది ! వాళ్ళు చేస్తున్న ప్రయత్నాలన్నిటిని చూసి భరించలేక 'కృష్ణని చేసుకుంటానని' భయం, బెదురూ కూడా లేకుండా ఆఖరికి చెప్పేసింది. కృష్ణ మీద కోపంతో వున్న తన తల్లిదండ్రులు యిలా చెప్పినా వినరని తనకు తెలుసు - అయినా పీడిస్తున్న ఆశని ఆపలేకపోయింది. తనలా ముక్కుసూటిగా చెప్పడంవల్ల నాన్న ఆడిన మాటలూ, అమ్మ తిట్టిన తిట్లూ 'ఎందుకడిగేనా' అని అనిపించేయి రాధకి- కృష్ణ వంక వాళ్ళకి అనవసరంగా తిట్లు తగిలేయి తప్ప ప్రయోజనం లేకపోయింది.

ఆ పెళ్ళి తల్లిదండ్రుల సంతోషం కోసం చేసుకున్నారు గాని తనకోసం కాదు. యీ సంగతి.. తను అప్పుడప్పుడు ధైర్యం చేసి తల్లిదండ్రులని అడిగినప్పుడు జరిగిన రాద్ధాంత సిద్ధాంతాలలో వాళ్ళ నోటంటే విన్నది. తన అభిప్రాయాలన్నిటిని వదిలి మార్చుకొని ఒప్పుకుంది. తన పెళ్ళికి దీనికి తోడు - అత్తని గాని, కృష్ణని గాని పిలవకపోవడం. వాళ్ళు రాకపోవడం మరీ మనస్సు చివుక్కుమంది. యిక తనని ఎన్ని జన్మలయినా కృష్ణ చూడడని అనుకున్నది. కాని యీనాడు అకస్మాత్తుగా.... అనుకోకుండా ... కలుసుకున్నందుకు...కృష్ణ...తనతో మాటాడుతూ...తన మాట - విన్నందుకు ఆశ్చర్యపోయింది. యిలా ఆమె ఏమేమో ఆలోచిస్తూ -

"నేను వెళతాను రాధా !" అన్న కృష్ణ మాటలకి ఆమెకి తెలివి వచ్చింది.

"అప్పుడే వెళ్ళిపోవాలా ? యింకా ఏదీ ఎంత సేపయిందని ?" అని అంటూ లోనికి పోయి కాఫీ తెచ్చి యిచ్చింది - ఇస్తూ....

"నిన్ను తిరిగి చూస్తానని అనుకోలేదు... నా పీడ కోసం వస్తుందని అనుకున్నాను..." అని అంది

"ఇది బావుంది... నేను మాత్రం అనుకున్నానా !"

ఇలా దైవికంగా కలుసుకున్నందుకు సంతోషంగా వుంది..." అని ఏదో జవాబు చెప్పాలి కదా అని చెప్పేశాడు. లోపున మాత్రం ఏదో చెప్పాలని తటపటాయిస్తున్నట్టు చంచలంగా వున్నాడు...రాధ అది గ్రహించింది. ...

"ఇంకా .... నువ్వు మనసులో పెట్టుకొని బాధపడుతున్నట్టున్నావు..." అని మెల్లిగా అంది...

"అబ్బే.... అలాటిదేమీ లేదు... అయినా ఏనాడో - చిన్నతనంలో మంచి ఏదో, చెడ్డ ఏదో... తెలియని ఆటలాడే స్థితిలో, అనుకున్నవన్నీ అక్షరాలా అవాలంటే ఎంతో పుణ్యం చేసుకోవాలి ! ఏమంటావు ?" అని అడిగాడు.

"అవును కృష్ణా ! అవును !" అని అంటూ రాధ తలవంచి నేల రాస్తూంది!

"అవన్నీ నెమరు వేసుకొనేకన్నా మరిచిపోయే కాలం వచ్చింది. కాలం మారిపోకుండా వుండదు. అదృష్టం కలిసివస్తే అనుకున్నవి అనుకున్నట్టు అవుతాయి... లేనపుడు... లేదు... కాని నీతో ఒక్కమాట చెప్పిపోవాలని వుంది" అన్నాడు.

"ఏమిటది ?" అని అడిగింది.

"ఆ భగవత్సాక్షిగా - జరిగిన సంగతులన్నీ మరిచిపోవాలి ! ... అవి జ్ఞాపకానికి రాకుండా చూసుకోవాలి ! నీ జీవితంలో యీ విషయాలు ఏ ఆటంకాన్నీ కలిగించకూడదు. నీ భర్తకి ఏ విధమయిన కష్టం కలిగించవద్దు. చిన్ననాడుకూడా నీ భర్తనే ప్రేమించావని అనుకో. నువ్వలా చెయ్యాలని కాదు. కాని యింకా యీ సంగతులు మరచి పోయేటంత కాలం జరగలేదు కాబట్టి - హెచ్చరిస్తున్నాను.. నన్ను పూర్తిగా మరిచిపో. యిలా నీకు తిరిగి కనబడి అనవసరంగా బాధపెట్టినందుకు నేను చాలా విచారిస్తున్నాను... ఇప్పుడు నేను నిన్ను కోరేది ఆ మాత్రమే - నేను రావడం మూలాన నీ మనస్సును మరింత చికాకు పెట్టేను...చాలా సేపయింది. నేనింక వెళతాను." అని కృష్ణ హృదయంలో వున్నదంతా

విషయం రాగానే చెప్పేశాడు.

ఇదంతా విన్న తర్వాత రాధ మరి మాట్లాడలేకపోయింది. అలా చూస్తూ నిలబడిపోయింది... కృష్ణ వెళ్ళిపోతుంటే..

''ఆయన వచ్చేవేళ అయింది. కాస్సేపు మాట్లాడి వెళ్ళరాదూ..'' అని అడిగింది

కాని కృష్ణ అప్పటికే చాలా వేళ అయిందని చెబుతూ గుమ్మం దాటాడు-

''అప్పుడప్పుడు వస్తూండు కృష్ణా!'' అని ఆఖరికి చెప్పింది

''అలాగే తప్పకుండా వస్తాను'' అని చెబుతూ కృష్ణ వెళ్ళిపోయాడు

కృష్ణ వెళ్ళిపోయిన నుండి రాధ ఆలోచనలోనే మునిగిపోయింది. ఆ రోజంతా తనకేదో భయంగానే వుంది. ఏమీ తోచలేదు... ఆ నిమిషం వేసిన పని మరో నిమిషానికే మరచిపోయింది. అప్పుడు! సరిగ్గా తను ఎలా భావించుకుంటూందో, ఏ విధంగా చెయ్యాలని అనుకుంటూందో ఆ విధంగానే కృష్ణ కూడా చెప్పేడు! అతని భావాలూ ఒక్కలాగే వున్నాయి.. కృష్ణ ఎంత వుత్తముడో అని అనుకుంది. పెళ్ళి అయిపోయిన తర్వాత కృష్ణ తనవాడు కాదని అనుకోవడం పొరపాటని, అలా అనుకుంటే అపచారం అని కూడా తెలుసును. తను కూడా కృష్ణని మరచిపోవాలనే అనుకుంటుంది గాని... అతని మీద వుండిన అభిప్రాయాలని మార్చుకోవాలి. గాని కృష్ణని మరచిపోవడం ఎందుకు? తనకి యిప్పుడేం తక్కువ? సరిగ్గా కృష్ణ లాంటి వుత్తముడే తనకి అదృష్టవశాత్తూ భర్త అయేడు... యింకా కృష్ణ కన్నా వుత్తముడే ఏమో! అతని ముందు గాని, అతనితో సంసారం చెయ్యడంలో గాని తనకే లోపం లేదు. విచారమున్నదే లేదు! తన భర్త ముందు కృష్ణని మరచిపోగలదు. ఆ గొప్పతనం తన భర్తలో వుంది. ప్రస్తుతం తనకి తన భర్త కన్నా కావలసిందేదీ లేదు. కావాలన్న తలంపూ లేదు... తను నిశ్చలమయిన, నిశ్చయమయిన మనస్సుతో కృష్ణని ఆహ్వానించింది. మాట్లాడింది. అందువల్ల తనకు ఎంతో తృప్తిగా వుంది.

రాత్రి తన భర్త రాగానే భోజనం పెట్టి తనూ తిని, వెన్నెట్లో పడుక్కుంది. తన భార్య అంత వేగిరం పడుక్కున్నా ఆఫీసు గొడవలు ఆలోచిస్తూంటే మూర్తికి ఎంతసేపయినా నిద్రపట్టడం లేదు. అలా ఆలోచిస్తూంటే రాధ ఏదో అంటున్నట్టు వినిపించి అటు తిరిగేడు.

''.... కృష్ణా ....నువ్వన్నది అక్షరాలా ... నిజం... చిన్నప్పుడు అనుకున్నవి జీవితంలో అలాగే జరగాలంటే చాలా పుణ్యం చేసుకోవాలి!.... అటువంటి పుణ్యం మనం చేసుకోలేదు... మన ప్రమాణాలు ఒట్లు... ఇవన్నీ యిప్పుడు తలుచుకున్నా లాభం లేదు... అవన్నీ అబద్ధం ...'' అని రాధ పలవరిస్తూంది..

ఇప్పుడు మూర్తి మరింత దీక్షగా ఆలోచించ మొదలెట్టేడు. యింతకు పూర్వం లేని ఏదో సంశయం రాధలో కనుపించసాగింది... ఆ పలవరింతల అర్థం కోసం ఆలోచించాడు గాని. తనకేం తెలుస్తుంది! ఏం జరిగిందో !! కాని ఆ మాటలవల్ల కొంతవరకూ యిలా గ్రహించగలిగేడు - చిన్నతనంలో ఎవరితోనో ఏదో విషయమై మనసారా మాట యిచ్చి వుంటుందని, దానికిప్పుడేదో అంతరాయం కలిగి వుండొచ్చని అన్నీ వూహించేడు... ఆ కృష్ణ అన్న వ్యక్తి ఎవరో గాని జ్ఞప్తికి

రావడం లేదు.

మూర్తి లేచి రాధ వంక చూశాడు. అమాయకంగా, ప్రశాంతంగా వున్న ఆమె ముఖాన్ని చూడగానే ఒక విధమయిన జాలి పుట్టింది. అప్పటికప్పుడే పలవరించడం మాని నిద్రకు పడుకున్న రాధను మరి లేపే ఆవశ్యకత లేనందువల్ల తిరిగి మూర్తి పడుక్కున్నాడు... యీ సందర్భంలోనే మరొకడయితే ఏమయి వుండేది? వెంటనే భార్యని లేపి విషయం అంత నిజం చెప్పేవరకూ పీడించి అడిగేస్తూ వచ్చి వుండేది కాని మూర్తి మనసు అటువంటి పని చేసేవాడు కాదు. అటువంటి మనిషి కాదు! అతనిలో వున్న విశేషమే అది! అయితే, అందరికీ సహజంగా కలిగే 'అనుమానం' మూర్తికీ కలిగింది. ఆ అనుమానం అతని దృష్టిలో చాలా విరుద్ధంగా కనబడుతుంది. అతని ప్రకృతి, స్వభావం ఎలాగయితే విరుద్ధమయినవో అలాగే అతనిలో కలిగే భావాలూ కూడా అంత భేదంగానూ వుంటాయి.

యీ విషయంలో ఆ రాత్రి అంత శ్రద్ధ తీసుకోనక పోయినా తెల్లవారిన తర్వాత కాఫీ తాగుతూ మెల్లిగా అడిగేడు:

"రాధా! రాత్రి ఏదయినా కల వచ్చిందా?"

"లేదండీ లేదే! ఏం అలా అడుగుతున్నారు?"

"అహా! పలవరిస్తేను... వచ్చిందేమో అనుకున్నా..."

"పలవరించానా? ఏమని?"

"పలవరించినదానివి నీవు... నాకా జ్ఞాపకం వుంటుంది?"

"బావుంది... విన్నవారు మీరు. మీరే చెప్పండి"

"ఏమిటో సరిగ్గా జ్ఞాపకం లేదుగాని... చిన్నప్పుడు... అనుకున్నవి జీవితంలో జరగాలంటే పుణ్యం చేసుకోవాలని... యింకా ఏవో ప్రమాణాలనీ...పలవరించావు..."

అది వినగానే రాధకి శరీరం కంపించి పోయింది - "అవును... అవును... అలా పలవరించానా" అని అంటూ నాలిక కర్చుకుంది -

"అన్నట్టు....కృష్ణ మీ మేనత్త కొడుకు కదూ"

"అవునండి..."

"అయితే ... చిన్నప్పుడేమిటి అనుకున్నారు . అనుకున్నవి ఎందుకు జరగలేదు... ప్రమాణాలు, చేసుకోవలసినంత పవిత్రమయిన విషయం ఏమిటి...?"

ఇప్పటికి పూర్తిగా రాధకి అర్థమయింది. శరీరం అంతా వణికిపోతున్నట్టయింది. చెప్పలేని భయంతో అదో అవస్థలో అప్పుడుంది. యిలా అడుగుతూంటే ఏమని చెప్పడం? ఎలా చెప్పడం? ఏం చెబితే ఏమొస్తుందో! తనకేం తోచలేదు...

"ఏమిటో ఆలోచిస్తున్నావు...?" అని జ్ఞాపకం చేశాడు మూర్తి -

"ఏం లేదండి!"

"మరి ఆ పలవరింత ఏమిటో? ...."

"అబ్బే ఏం, లేదండీ! పలవరింతలకీ, కలలకీ నిజం వుంటుందా? ఒంటిమీద తెలివి లేకుండా

ఏదో అలా అనేసి వుంటాను!"

"ఉంటుంది... నిజం వుంటుంది... నిన్న సాయంత్రం నుండి అదోలా వుంటున్నావు."

"ఏం చెప్పమంటావ్ ఏమీ లేదేమ!"

"పోనీలే. నీ కిష్టం లేకపోతే నా కెందుకు!" అని కొంచెం కోపంగా అన్నాడు.

అది చూసి రాధ ఏమనుకుందో ఏమో -

"అదికాదండీ! చిన్నతనంలో మా వాళ్ళందరూ అనేవుండేవారు. అప్పుడు సుబ్రహ్మణ్యంగారి కృష్ణ, నేను ఆడుకొనేవాళ్ళం. ఆ ఆటల్లోనే అప్పుడప్పుడు దేనికో దానికి దెబ్బలాడుకొనేవాళ్ళం. ఐనా ఈ యిద్దరం ఎప్పుడూ జట్టీలాడుకోకూడదని అనుకొని సరదాకి ఒట్టు వేసుకున్నాం. ... మా వాళ్ళు యిప్పుడు జట్టీలు పెట్టారు. అది జ్ఞాపకం వచ్చి సంతోషించానుకాబోలు... అక్కడ నుండి వెళ్ళిపోయాంది. గానీ మా వాళ్ళకి యీ జవాబు ఏమీ నచ్చలేదు... ఆ మనస్సులో ఏదో కొంచెం దాచినట్టు గ్రహించాడు...." రాధ దగ్గరికి వచ్చి -

"యిది నిజమే కావచ్చుగాని... యింకా వుంది. చెప్పవలసింది... నీకేమీ భయంలేదు చెప్పాలని లేకపోతే... యిబ్బంది లేదు.... గానీ చెప్పినదేదో నిజం చెప్పు. లేకపోతే నా మీద ఒట్టు."

"ఏం చెప్పమంటారు యీ పాటిదానికే ఒట్లు - సత్యయానా! యివాళ ఎవరి మొహం చూశానో!" అని పైకి మాత్రం అనేసిందిగాని లోపల బాధపడుతూంది - శరీరం అంతా చెమ్మటపట్టియింది మనస్సులో చెప్పలేని ఆందోళన వ్యాపించి వుంటూంది. ఆ ఒట్టు అనే మాట తన హృదయంలో అశాంతిని రేకెత్తిస్తూంది. కొన్ని కొన్ని సమయాల్లో మాటలు కత్తికన్నా దారుణంగా, కఠినంగా వుంటాయి. మరికొన్ని సందర్భాల్లో నవనీతం కన్నా మృదువుగా వుంటాయి. మరోకప్పుడు ప్రాణాన్ని సులువుగా తీసేస్తాయి. వేరొకప్పుడు ఆ ప్రాణాన్నే అవలీలగా కాపాడుతాయి. ఈ మాటలవల్ల యితర సాధనం వల్ల సాధించలేని కార్యాన్ని సాధించవచ్చు.

ఇప్పటికప్పుడే భర్త అడిగిన దానివల్ల రాధ బెంబేలెత్తిపోయింది. తిన్నగా నోటంట మాట వచ్చే శక్తి కూడా పోతూంది. ఇప్పుడు భర్త వేసిన ఒట్టు మరింత కలచివేస్తూంది. ఆయన వేసిన ఒట్టుని కాదని అబద్ధం చెప్పేకన్నా... నిజం చెప్పడమే ఉత్తమం అనిపించి ఆమె -

"మొదటినించి మా వాళ్ళందరూ నన్ను కృష్ణకి యిద్దామని అనుకుంటూ వుండేవారు. చిన్నప్పుడు, మేము ఒక దగ్గరే వుంటూ వుండడం వల్ల కృష్ణా నేను కలిసే ఆడుకుంటూ వుండేవాళ్ళం. (వరసకి బావ) మా యిద్దరినీ చూసి మొట్టమొదట మా వివాహ ప్రసక్తే ఎత్తేవారు. ఆ వయస్సుకి, వివాహం అంటే ఏమిటో, ఎందుకో కూడా మాకేమీ తెలీదు... తెలియకపోయినా - అందరూ మమ్మల్ని చూసి అనే మాటలూ, ఆ వాతావరణం బట్టి మేం యిద్దరం పెళ్ళి చేసుకోవాలి; లేకపోతే వీల్లేదు కాబోలు - అని అనుకొంటూ వుండేవాళ్ళం. ఒకనాడు ఆ ఆటల సందడిలో చిన్నతనం చేష్టలవల్ల యిది తప్పు, ఒప్పు అని తెలియకపోయినా యిది అనుకోవచ్చు, యిది అనుకోకూడదు - అన్న విచక్షణ లేకుండా - నేను, కృష్ణని, కృష్ణ నన్ను, తప్పకుండా పెళ్ళి చేసుకుందామని చేతిలో చెయ్యి వేసుకున్నాం. అంతే. అంతకన్నా వేరే ఏమీ లేదు. అందరూ అనుకున్నట్టుగా కాలేదు. పెద్దవాళ్ళ మధ్య కలతలు వచ్చి కానివ్వలేదు.

యిప్పుడు ఒకరిపొడ మరొకరికి కిట్టదు. విన్నను కృష్ణ ఈ వూరిలోనే వున్నాడో ఏమో యీ దారంట వెడుతూ కనిపించేడు... ఏదో తలపుకి వచ్చి తెలివిలేని అవస్థలో అనేసేనేమో గాని నా తలంపే లేదు. నేనస్సలు పూర్తిగా మరిచిపోయాను. ప్రస్తుతం నాకేమీ అటువంటి కోరికగాని, ఆశగాని ఏమీ లేదు.... క్షమించండి. మీరే నాకు సర్వమూను. మీకన్నా నాకు కావలసిందేమీ లేదు... నా మీద మీరనుమానపడుతున్నారేమో అని నాకు చాలా భయంగా వుంది.... నా మాటల్ని నమ్మండి. నా నేనేవిధంగా ఋజువు చేసుకోగలను? ఈ పాపిష్టి నోటంట యింకా ఈ మాట వెంటనే ఎలా వచ్చిందో తెలియకుండా వుంది. నన్ను క్షమించండి'' అని గబగబా ఆవేశంతో అంటూ వస్తున్న దుఃఖాన్ని అణుచుకోలేనంటూ మరి మాటలు రాకుండా తడబడుతూ వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టింది.

మూర్తి యింతవరకూ వస్తుందని అనుకోలేదు. తను అడిగినదానికి జరిగినదేదో చెప్పమనే ఉద్దేశ్యంతో వున్నాడుగాని ఆమె యింత భయపడిపోయి, ఏడ్చే పర్యంతం చేస్తుందనుకోలేదు.

''అదేమిటి, రాధా! నేనేమన్నానని! నేనలా ఎప్పుడయినా అనుకున్నానా? యిప్పుడేం కొంప మునిగిపోయిందని అంతలా యిదవుతావు? నువ్వేం తప్పు చేశావని ఏడుస్తున్నావు'' అలా ఏడవకూడదు!'' అని చల్లని మాటలతో రాధని ఓదార్చి ఆమె ముఖం మీద చిరునవ్వు చూసేవరకూ వదిలేడు కాదు. ఆ తరువాత ఆఫీసుకు వెళ్ళిపోయేడు.

నిర్బంధం మీద ఎలాగో పెదిమల మీదకు రాని నవ్వు తెచ్చుకుందిగాని ఏ స్త్రీకి అటువంటి సమయంలో నవ్వు వస్తుంది? తన భర్త అలా అన్నా యింకా అనుమానపడుతున్నాడేమో అని బాధపడుతూనే వుంది. ఈ విషయాన్ని అపార్థం చేసుకుంటే చాలదూ? అలా అయినట్టయితే తన సంసారం ఏమవుతుంది? తన జీవితం ఏమవుతుంది? అందుకనే ఆమె అనేక విధాల నొచ్చుకుంటూంది.

రోజులు యథాప్రకారంగానే నడుస్తూన్నాయి. తన భర్తలో ఏమీ మార్పులేదు. జరిగిన ఆ విషయమే ఎత్తలేదు... మామూలుగా నిత్యం జరిగినట్టే వెళుతూంది... అయినా రాధ మనస్సులో దిగులు పోలేదు, లోలోనే తలుచుకుంటూ కృంగిపోతూంది. ఎంతసేపూ తన అనుమానం, బెంగ - ఏమంటే తన భర్త ఏమనుకున్నాడో అనే, తన్నుతాను ఎన్ని విధాలో నిందించుకుంది. ఏనాడో మరిచిపోయిన సంగతులు తనకు తెలియకుండా, తన మనస్సుకి విరుద్ధంగా తననోటే అనిపించిన భగవంతుణ్ణి కూడా ఆడిపోసింది. గొంతుకలోనే ఏడుపుని దిగమింగింది. ఎన్నోసార్లు పైకి కూడా ఏడ్చింది? అంతకు మించి ఏం చేస్తే తన మనసుకి శాంతి కలుగుతుందో కూడా తెలీదు. నిజంగా తన భర్త అన్న మాటలు బట్టి అతను ఏమీ అనుమానపడలేదా? తను యింతకన్నా ఏం చెప్పగలదు? తను నిజం దాచకుండా చెప్పేసింది. దానిని నమ్మకపోయి, అంతవరకు వస్తే ప్రాణత్యాగం తప్ప వేరే గతిలేదని అనుకుంది. ఇలా అనుకుంటూ వుండగా తలుపు చప్పుడయింది. గబగబా కళ్ళు నీళ్ళు తుడుచుకొని తలుపు తీస్తూ కృష్ణని చూడగానే గతుక్కుమంది! ఇలాటి పరిస్థితిలో కృష్ణ రావటం తనకు ఇష్టంగా లేదు. అసలు కృష్ణ మరి రాడనే అనుకుందిగాని చూస్తూ చూస్తూ మనిషినంత మనిషిని ఎలా పొమ్మంటుంది? రమ్మనలేక లోనికి రమ్మంది! మరోసారి తన భర్త చెవిని యీ సంగతి పడితే

ఎంతవరకూ వస్తుందో! అని ఆమె బెంగ. కృష్ణ లోనికి వచ్చాక ఆమె మనస్సు బితుగు, బితుగు లాడుతూంది. ఇహ తన భర్త వచ్చే వేళ కూడా అయింది. ఇలాటి సందర్భంలో ఆమె పడిన ఆ అయిష్టతనేమీ పైకి కనపడనీయకుండా -

''దారి తప్పి ఇలా వచ్చినట్టుంది!'' అని పలకరించింది.

''లేదు గుర్తుంచుకొనే వచ్చాను. ఇవాళ సెలవు. అన్నగారిని చూసిపోదామని - వచ్చాను. ఇంకా రాలేదా?'' అని జవాబిచ్చాడు.

''లేదు వచ్చేవేళయింది అలా కూర్చో!'' అని ఆమె అనగానే -

''ఏం అలా నీరసంగా వున్నావు?'' అని కుశల ప్రశ్న వేశాడు

''ఎలా వున్నాను... నాకేం అలా అంటావు?'' అని అంటూ వుండగానే మూర్తి వచ్చి కృష్ణని చూశాడు.

''ఓహో! ఏమిటిలా వచ్చావు? ఎప్పుడూ లేదు! -'' అని అడిగాడు నవ్వుతూ -

''అబ్బే, విశేషం ఏమీ లేదు, ఓసారి చూసి పోదామని'' -

''ఇంకేమిటి విశేషాలు - అన్నట్టు - రాధ కాఫీ ఇచ్చావా?'' అని మర్యాద చేశాడు.

రాధ టక్కు వచ్చిపోయినట్టయి అలానే నిలబడి పోయింది. -

''వద్దండి తాగే వచ్చాను'' అని కృష్ణ మొహమాట పడ్డాడు.

''కాఫీకి ఎన్నిసార్లు అయినా బాధలేదు'' అని మూర్తి బలవంతం చేశాడు.

రాధకి మూర్తి రాగానే ప్రాణం పోయినంత పని అయింది. ఏదో దిగులు పట్టుకుంది. లోనికి వెళ్ళి వణుకుతున్న చేతులతో కాఫీ అందించి, అక్కడ నుండి వెళ్ళిపోయింది.

ఇవతల కృష్ణకీ, మూర్తికీ సాధారణంగా బంధువు లిద్దరు కలుసుకున్నప్పుడు జరిగే సంభాషణే జరిగింది. కొంతవరకూ ముచ్చటించి కృష్ణ సెలవు తీసుకొని బయలుదేరాడు...

కృష్ణ అటుపడగానే రాధ విషయం మూర్తికి జ్ఞాపకం వచ్చింది. అది రాగానే అలాగే ఆలోచిస్తూ కుర్చీలో వుండిపోయాడు? కృష్ణ తనను చూడాలన్న కుతూహలం కన్నా రాధని చూడాలన్న వుద్దేశ్యంతోనే ఇక్కడకు వచ్చివుంటాడు. కృష్ణ ఇంకా రాధ మీద చిన్ననాటి వుద్దేశ్యాలనే కలిగి వున్నాడా?... ఆమెని ఇప్పుడూ ప్రేమిస్తున్నాడా? ఎందుకు కూడదు? అయితే రాధ విషయమో? ఆమె అట్లా కనబడదు. ఆమె మనసు పూర్తిగా మార్చుకున్నట్టే వుంది. ఏమో చిన్నప్పుడు కలిసి మెలిసి తిరిగినవాళ్ళు, ఒకళ్ళనొకళ్ళు ప్రేమించుకొనే దృష్టితో మొదటినుంచీ వున్నవాళ్లు అయినప్పుడు ఒక్కసారి ఇప్పుడు బలవంతాన్న మార్చుకోగలరా? రాధ ఎంతలా దాచడానికి ప్రయత్నించినా ఈ నాల్గురోజులూ పూర్వపు మనిషిలా లేదు.... దానికి కారణం ఏమిటి? ఆమె ఎందుకో కొంత బాధపడుతూ వుంది. అదేదో తనతో చెబితే ఎంత బావుండును? అడుగుతే చిన్నబుచ్చుకొని ఏమనుకుంటుందో?

ఎంత మంది భర్తలు తమ భార్యలకి తెలియకుండా దొంగతనంగా తమ కోర్కెలని నెరవేర్చుకోలేదు? ఏంచేశావని ఎవరయినా అడిగారా? వారి భార్యలకి తెలిసినా అడ్డుపెట్టగలుగుతున్నారా?

అలాగే తమ భార్యలు కూడా అని ఆలోచించారా ?

ఇలా అనుకొని ఒక్కసారి లేచి బయలుదేరాడు. చాలా తొందరగాపోయి కృష్ణని కలుసుకొని భుజం మీద తట్టేడు. పరధ్యాన్నంలో వున్న కృష్ణ తుళుక్కుపడ్డాడు. యితడిని చూసి ఎందుకిలా వెంట వచ్చాడో అర్థం కాక తికమక పడ్డాడు.

''కృష్ణా ! యిప్పు డెక్కడికి వెళుతున్నావ్ ?'' యీ ప్రశ్న కొంచం ఆశ్చర్యంగా తోచి -

''ఆఁ లాడ్జికి... లాడ్జికే... పోతున్నాను''

''యింకా పొద్దుపోలేదు. పార్కుకి పోదాం రాకూడదూ ?''

''సరే పదండి !''

ఇలాగని మూర్తి వెనకాల నడిచి వెళుతున్న కృష్ణ, తన్నా విధంగా వెనువెంటనే కారణం లేకుండా, కలుసుకున్నందుకు లోలోపునే తటాపటాయిస్తున్నాడు.

పార్కులో యిద్దరూ కూర్చున్నారు. కొంతవరకూ ఎవ్వరూ కలుగజేసికొని మాటాడలేదు. మూర్తి కృష్ణ ముఖం వంకే చూస్తూండడం వల్ల కృష్ణ తలదించుకు గడ్డిమొక్కల్ని పిదుముతున్నాడు. కొంతసేపయినాక మూర్తి మాటల్లోకి దింపేడు:

''యిది ఆఖరు ఏడు కదూ?''

''అవునండీ!''

''యింకా చదువుతావా ?''

''చదవాలనే వుంది !''

''అదే మంచిపని. అన్నట్టు... ఆ ... పిల్లని నువ్వు చూసుకున్నావా '' అని వున్నట్టుండి అడిగేటప్పటికి కృష్ణ ఒకసారి మూర్తి మొహం వైపుచూసి - .

''ఏ పిల్లని ?'' అని అడిగేడు -

''అదే - మొన్న మీ అమ్మగారు సంబంధం కోసం వెళ్లేరటగా... వాళ్ళ విషయమే -''

''బావుంది.... ఎవరు చెప్పేరు మీతో... మా అమ్మ ఎక్కడికీ - ఎవరింటికీ ... యిలాటి విషయాలలో వెళ్లలేదే... నా కసలా విషయమే చెవిని బడలేదే - ?'' అని ఆశ్చర్యంతో అన్నాడు....

''నీకు తెలియక పోవచ్చునులే... శుభకార్యాల విషయాలలో పెద్దవాళ్ళకు నిద్రపట్టదు... వూరికనే భోగట్టా కోసం అడిగేను...''

''సరే - దానికేం వుంది లెండి... అయినా నాకింత వేగిరం పెళ్ళి చేసుకోవాలని కూడా లేదు లెండి!''

''ఆ ... దానికేంలే.... అందరూ యిలా అన్నవాళ్ళే ... అయినా పెళ్ళి చేసుకొనే వయసు వచ్చి కూడా ఏమిటి అభ్యంతరం ?''

''అది - సరే- లెండిగాని ఒక వ్యక్తి వుపాధి దొరికేవరకూ వివాహం చేసుకోకూడదని ... నా వుద్దేశ్యం .... అంతవరకూ ఆ ప్రసక్తి లోకే తీసుకుపోకుండా వుండడం పెద్దవారి విధి - అని గూడా నా అభిప్రాయం. ఒకరి వల్ల సుఖపడే ఆశ వున్నపుడు వారిని కూడా సుఖపెట్టే స్తోమత కలిగివుండాలంటారా ?

''నువ్వన్నది కాదనలేను గాని... ఉదయం లేచినది మొదలు నియమంగా ...కాలకృత్యాలు ఎలా నెరవేర్చుకుంటున్నామో ఆలోచించు! సృష్టి అంతా ఏదో ఒక నియమాన్ని అనుసరిస్తూనే వుంది. పుట్టిన దగ్గర నుండి ప్రాణం పోయేవరకూ మానవుడు యీ నియమాల మెట్లను ఒక్కొక్కటి ఎక్కుతూ పోవాలి. ఆ క్రమం ఎక్కే మెట్లలోనే వుంది. అవి తప్పించుకుపోవడం సాధ్యం కాదు. అందువల్ల ఏ వయస్సులో జరుగవలసిన అవసరాలు ఆ వయస్సులోనే జరగాలి. అడ్డు చెప్పవలసిన అవసరం కనబడలేదు... ఏమంటావు?''

''ఏమిటో...! మీరంటున్నదంతా నాకయోమయంగా వుంది.... నాకేం తొందర చెప్పండి?'' అని అనేవాడేగాని యిలా ప్రత్యేకించి తీసుకువచ్చి యీ విషయాలు విదాలించి ఎందుకడుగుతున్నాడో గ్రహించడానికి అవస్థపడుతున్నాడు...

''మీరేమన్నా.... చదువుకుంటూండగా మధ్యలో పెళ్ళి చేసుకుంటే చదువు సాగదండి...'' అని మళ్ళీ అన్నాడు.

''సాగదు - అనడమే గాని ఎందుకు సాగదో చెప్పవేం? దానిలో కొంత నిజమున్నా వ్యక్తిని బట్టి మారుతూంటుంది. ఆలస్యం అమృతం విషం' అన్న పెద్దలు 'శుభశ్య శీఘ్రం' అని కూడా అన్నారు. అలాగే 'వివాహం విద్య నాశనం' అన్నా వెంటనే 'వివాహం పురుష లక్షణం' అని అన్నారు.... వివాహం జరగవలసిన కాలంలో జరిగితే అది ఏ పరిస్థితులలో నయినా మరొకదానికి అడ్డు అనిపించుకోదు''

''సరేలెండి అంతవరకూ వస్తే అందరూ అవునన్నది నేకాదంటానా?''

''మీ వదిన రోజూ నీ విషయం చెబుతూనే వుంటుంది. నీకు పెళ్లయితే చూడాలని చాల తొందర పడుతూంది?''

''మా వదినా - నా పెళ్ళి గురించి తొందర పడుతూందా? ఏమని? -'' అని వింతగా అడిగేడు

''ఏం? అది సహజమే కదూ దగ్గిర వాళ్ళయితే ఆ అభిమానం ఎలాగూ వుంటుంది.''

''ఆ అభిప్రాయం కలిగి వున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది. ఒక వ్యక్తి మీద మంచి అభిప్రాయాలు కలగిన వారుండడం చాలా అరుదు.''

సన్నిహితంగా చిన్నప్పటినుండి పెరిగిన వాళ్ళయితే వారు జీవితాంతం ఒకరి నొకరు మరిచిపోలేరు. కష్టాన్ని, సుఖాన్నీ ప్రత్యక్షంగా తీసుకుంటారు. అటువంటప్పుడు ఒకరి సుఖాన్ని ఒకరు ఎక్కువగా కోరడం ఆశ్చర్యం కాదు.''

యీ మాటలు విన్న తర్వాత కృష్ణకి కొంచం అనుమానం తోచింది. మూర్తి ఏదో వుద్దేశ్యాన్ని వెనకనుంచుకొని యీ ప్రసంగం అంతా ఎత్తుతున్నట్టు అనుకున్నాడు.

''మీరు వున్నది వున్నట్టు చెప్పేరు!'' అని మాత్రం వూరుకున్నాడు.

''మీ వదినే చెప్పింది. మీరు చిన్నప్పటి నుండి కలిసిమెలిసి వుండేవారని. ఆమెని నీ కిచ్చే పెళ్ళి చెయ్యడానికి మీ వాళ్ళు మొదట అనుకున్నారని -'' అని మధ్యలో వదిలేశాడు.

కృష్ణ విస్తుపోయేడు. ఆయన ఒక్కొక్కటీ యిలా చెబుతూంటే ఏమి చెప్పడానికీ తోచక తబ్బిబ్బు అయిపోతున్నాడు. యీ సందర్భాన్ని యింకా ఎంతవరకూ తీసుకుపోతాడో అన్న భయం

మాటలు వింటే నువ్వు ఆశ్చర్యపోతావని నాకు తెలుసు! కాని అందరిలాటి తత్వం నాది కాదని చెబుతున్నాను... నేనంటున్నవన్నీ హృదయపూర్వకంగానే చెబుతున్నాను. యిందులో వెటకారంకాని, మరి ఏ అనుమానం, అపోహ, యీర్ష్య, కోపం కాని ఏఁవీ లేదు'' -

దీనికి కృష్ణ ఏఁవీ జవాబు చెప్పలేదు... తిరిగి మూర్తి అందుకున్నాడు -

''రాధకి నీ మీద ఎటువంటి ప్రేమ వుప్పదో, ఎలాటి భావాలని కలిగి వుప్పదో నాకు బాగా తెలుసు! కలిసిన మనసుల్ని విడదీయడం నాచేతగాదు. యీ నా అభిమతం అందరికీ విపరీతంగా వుండొచ్చుగాని నే చెప్పబోయేది, చెయ్యబోయేదీ నాకు సమంజసంగానే వుంది. నేనేదో నవ్వులాటకి అంటున్నానని అనుకోవద్దు. నే చెబుతున్నవన్నీ ఒక స్నేహితుడిగా చెబుతున్నాగాని రాధ భర్తగా కాదని మాత్రం నమ్ము.''

కృష్ణ యిప్పుడు పూర్తిగా చైతన్య విహీనుడయిపోయాడు. మూర్తి మాటలు వింటూంటే ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు. ... అతని హృదయం ఏమిటో, అతని తత్వం ఏమిటో! ఆయన భావాలేమిటో అర్థం కాలేదు... కాని అతను అనుమానంతో యింతవరకూ ప్రశ్నిస్తున్నాడన్న శంక నిజంకాదని కొంచం గ్రహించేడు.... అయినా యింకా పూర్తిగా నిశ్చయించుకోలేదు. అతడే వుద్దేశ్యంతో యిటువంటి మాటలాడుతున్నాడు? ఆ మాటలబట్టి చూస్తే ఏ మానవుడూ కూడా అలా అనడే? యింతకీ అతని ప్రయత్నం ఏమిటి? యిప్పుడు రాధనీ, తననీ తిరిగి కలపడానికా? ఆయన ఆ అర్థంలోనే మాటాడుతున్నాడు! యింత విపరీతమయిన స్వభావం ఎవరికయినా వుంటుందా? యింత అస్వాభావికం అయిన తత్వం తను ఎక్కడా కనివిని ఎరుగడే? పౌరుషం, రక్తం, మాంసం వున్న ఏ పురుషుడయినా సహిస్తాడా? తనుగా స్వయంగా యిలా చెబుతాడా? మహామహుల చరిత్రలోగాని, మహాఋషుల జీవితాలలోగాని తగిన కారణం లేకుండా యిలా చేసిన మహాత్ములని వినలేదే? యీ పరిస్థితులలో యీ మూర్తిని ఏ దృష్టితో చూడడం? ఎటువంటివాడని అనడం? మహాపురుషుడని అనడఁవా? మెదడు చెడిన పిచ్చివాడని ఎంచడమా? అలా అనుకుందుకు యింత సమయస్ఫూర్తిగా, సబబు సందర్భంగా ఎవరు మాటడగలరు? అయితే యింత తెలిసినవాడూ రాధ మనస్సును ఎందుకు తెలుసుకోలేకపోయాడు? అసలు రాధ యీ విషయం వింటే ప్రాణత్యాగం చేస్తుందిగాని ససేమిరా ఒప్పుకుంటుందా? ఆమె సంగతి తనకు తెలుసు! తనింతలా నొక్కి నిజం చెబుతున్నా పట్టించుకోకుండా వున్నాడే? తనెలా యింక నచ్చ చెప్పడం?

యిలా కృష్ణ ఆలోచనలో పడిపోయి వేగిపోతున్నాడు. యీ ప్రసంగం యింకా పొడిగించడం తనకి యిష్టం లేదు. అతనితో యింకా అట్టేసేపు మాటాడ్డం కూడా అనవసరం అనుకున్నాడు. ఏదో ఒకటి అడిగేసి అతని వుద్దేశ్యం ఒక్కముక్కలో తెలుసుకుందికి నిర్ణయించుకున్నాడు.

''మీ రంటున్నదంతా నాకగమ్యగోచరంగా వుంది. యింతకూ మీ అభిప్రాయం ఏమిటో, మీ ఉద్దేశ్యం ఏమిటో నాకు బోధపడలేదు -''

''నే నింతవరకూ చెప్పినదాంట్లో అదంతా విశదీకరించే వున్నాను. సరే విను. ఒక్క ముక్కలో చెప్పాలంటే - యిప్పుడు నీ కభ్యంతరం లేకపోతే రాధని నీ కిచ్చి తిరిగి వివాహం చెయ్యడానికి

సంకల్పించాను'' - అని మూర్తి విపులంగా చెప్పేసేడు. యిది విని కృష్ణ, మూర్తి మొహం చూస్తూ వుండిపోయాడు. అలా అంటాడని ఎన్నడూ అనుకోలేదు. మొదట వేళాకోళానికి అంటున్నాడనుకున్నాడు గాని యిప్పుడు అదంతా బుద్ధిపూర్వకంగా అన్నదే అని గ్రహించేడు

''మూర్తిగారు! యిప్పటికి కూడా నన్ను సరిగా అవగాహన చేసుకోలేక పోవడం నా దురదృష్టం! మీరింత పొరపాటు పడతారని నేననుకోలేదు. మీ స్వభావం అసలే అర్థం కాలేదు - నచ్చలేదు కూడా. నా నుండి యింతవరకూ వస్తుందని తెలుసుకోలేకపోయాను. మా యిద్దరి మధ్య ఏదో అపవిత్ర సంబంధం కల్పించుకొని అనవసర ప్రస్తావన సాగిస్తున్నారు. యిప్పుడామె నా సోదరి! యీ నా మాటలన్ని మీ సుఖాన్ని పాడుచేసుకోకండి. మీరు సుఖంగా వుండడం కన్నా నాకు కావలసింది ఏదీలేదు. ఆ విషయాలు అప్పటిలోనే మాసిపోతాయని అనుకున్నాను గాని మీ ఆనందమయమయిన సంసారంలో చిచ్చు పెడతాయని అనుకోలేదు మొట్టమొదట మీ యింటికి వచ్చి మీ యిద్దరినీ చూశాక నేనెంత సంతోషించేనో చెప్పలేను. కడకు యిలా మారుతుందని తెలిస్తే.... మొదటే జాగ్రత్తపడి వుందును...'' అని మరి ఆవేశంలో అనలేక పోయినాడు.

''అటువంటివన్నీ పట్టించుకొనే వారికి గాని కాని వారికేమి? కృష్ణా! నా మాట విను - నీవూ, రాధికీ!..'' అని కృష్ణ చెయ్యి పట్టుకొని బ్రతిమాలబోయినాడు - కృష్ణ నిలువునా నీరయిపోయినాడు.

''మూర్తిగారు! క్షమించండి! నిజం తెలుసుకోలేనివారితో మాటాడితే నింద తప్పిస్తే వేరొక ప్రయోజనం లేదు! యింక నేను వినలేను! చెప్పవలసిందేదో అన్ని విధాలా చెప్పేను. మీరు వినదలచుకోలేదు. రాధ నా చెల్లెలు. అలాటి అపోహలు పెట్టుకోవద్దు.... యింక ఆ విషయం నా దగ్గర ఎత్తవొద్దు'' అని గట్టిగా అరిచేడు... యిలా అంటున్నపుడు కృష్ణ శరీరం అంతా చెమటపోసింది. ముఖం ఎర్రగా మారిపోయింది.

''మళ్ళీ మొదటికే వచ్చేవు కృష్ణా! నువ్వన్నది నమ్మడం లేదని అంటున్నావు. అంతేనా! నేను నీ స్నేహితుణ్ణి అనే దృష్టిలోనే వుండు. నాలో ఎందుచేతనో అలా చెయ్యాలని బుద్ధి పుట్టింది. యిన్నాళ్లు ఆమెకు భర్తగా వుండి ఆమె పట్లనే చెయ్యవలసిన విధి. యిది తప్పదు.... నేనే స్వయంగా బాధ్యత వహించి మీ యిద్దరికీ వివాహం చేస్తాను. ఎవరో ఏమో అనుకుంటారని భయపడవద్దు'' అని యింకా మూర్తి అంటూనే వున్నాడు...

బహుశా కృష్ణ వుద్రేకాన్ని పట్టలేక పోతున్నాడు. ఆ స్థితిలో ఎటువంటి మాటలు నోటంట వస్తాయో అని కూడా భయపడ్డాడు. అయినా కొంచం శాంతంగానే మొదలెట్టేడు.

''ఏమండి, మీలో మానవాతీతమయిన శక్తి ఏదో ప్రవేశించి యిలా మాటాడిస్తూంది. లోకంలో యిది అసహజమయిన విషయం! ఎవడూ యీ విషయం యిలా చెప్పడానికి సాహసించడు, చెప్పలేడు అటువంటిది మీరు యిలా అంటూంటే నాకు ఏడవడమో నవ్వడమో తెలియటలేదు. మీ వుద్దేశ్యాలూ, ఆదర్శాలూ ఎలా వున్నా! నాకూ ఒక ఆదర్శం, నీతి, కట్టుబడీ వున్నాయని మరిచిపోకండి. పండువంటి సంసారాన్ని పాడుచేసే టటువంటి మూర్ఖుణ్ణిగాను. మీకన్న వయస్సులో చిన్నవాడినయినా నాకున్న వివేకం ప్రకారం చూస్తే నేనీ పనికి ఎంతమాత్రమూ ఒప్పుకోలేను.

మనిషికున్న యీ మాత్రం జ్ఞానాన్ని... మరిచి భ్రష్టుడిని అవలేను. నాపై మీకున్న అభిప్రాయం చాల ప్రమాదకరమయినది. నేనలాంటి వాడిని కాదు. వినండి మా పూర్తి చరిత్ర. నా ముఖంగా వింటే మీ మనసు మారుతుందేమో!

"చిన్నప్పుడు మేం ప్రేమించుకోవడం కాదు - ఆ వయస్సులో ప్రేమ అంటే ఏమిటో, అభిమానం అంటే ఏమిటో - ఒక్క చెలిమి, తప్పిస్తే తెలిసే తెలీదు... అయినా మా వాళ్ళందరూ పెంచిన వాతావరణం బట్టి - "పెళ్ళాడుకుందాం" అని అనుకోవడం నిజం - కాని వయస్సు వచ్చి జ్ఞానం కలిగిన తరువాత క్షణం సుఖంకోసం మా భావి జీవితాలని నాశనం చేసుకోలేదు. అప్పటికీ మా మీద అభిప్రాయం ఎవరిలోనూ మారకపోయినా - నూటికి నూరుపాళ్ళూ... మేము ఎవరి హద్దులను వారు దాటిపోలేదు. ఒకనాడు నేను చేతిలో చెయ్యి వేసుకొని మేం అనుకున్న అభిప్రాయాలకి తోడు యిమ్మని ఆ భగవంతుణ్ణి వేడుకోవడం కూడా సత్యమే. యింతకన్నా మరే విధమయిన రహస్యం మా యిద్దరిలోనూ లేదు. ఆ భగవంతుడి సాక్షిగా నేను నిజం చెబుతున్నాను. మీరు ఆమెని వివాహం చేసుకున్నారు. మీ విధి మీరు నిర్వర్తించాలి గాని యిలా అనడం భావ్యం కాదు... ఆ సీతని మీరు విడవరాదు. యింతకన్నా నచ్చచెప్ప డెలాగో నాకు తెలియడం లేదు. నమ్మితే నమ్మండి. లేకపోతే లేదు. మీ యిష్టం" అని యీ ముక్కలు ఆవేశంతో అంటూ కృష్ణ వున్న చోటు నుండి లేచేడు. కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి. అయినా మూర్తి ప్రయత్నం మానలేదు.

"కృష్ణా! నాలో లేని భావాల్ని - కల్పించుకొని మాటాడుతున్నావు. నా అంతరాత్మ నిన్నూ, రాధనీ కలిపి తృప్తి చెందమని అది నీ విధి అని ఘోషిస్తూంది. అది ఎలా కాదనగలను? యిన్ని విధాలుగానే బతిమాలుతున్నా నువ్వు చెప్పిన నిజాన్ని గ్రహించలేదంటే నేనేం చెప్పగలను?"

"ఏమండీ ఒక్కమాట అడుగుతా చెప్పండి! మీ చేతులతో స్వయంగా రాధకి తాళిగట్టి, ఆమెకు మీరే పూనుకొని మరో భర్తని తెచ్చి పునర్వివాహం చేస్తామంటున్నారు. యిదెంత అసహజమయినది? యిదెంత హేయమయినది. ఎంత నీచమయినది. యిది హర్షింపదగ్గది మాత్రం కాదు... మీలో ఏ లోపం వుందని యింత బాధపడుతున్నారు!" అని ఆఖరికి అనేశేడు...

"నువ్వెలా అనుకున్నా బాధలేదు. ఆఖరి సారిగా చెబుతున్నా నా చేతులతో గాదు... నీ చేతులతోనే ఆ తాళి ఆమెకు కట్టేను అని అనుకోరాదా? సరేనా?" అని తిరిగి అన్నాడు.

"మూర్తిగారూ! మానవ జన్మ ఎత్తినందువల్ల సాధ్యమయినంతవరకూ దానిని సార్థకం చేసుకుందుకు ప్రయత్నించాలి. అందుకు తోటి మానవుణ్ణి అర్థం చేసుకోవడం అవసరం... దానికోసం మీరు ప్రయత్నించండి.... యింక సెలవు" అని అంటూ మూర్తి చెబుతున్నది వినిపించుకోకుండా అక్కడినుండి కృష్ణ గబగబా వెళ్ళిపోయినాడు.

మూర్తి అతగాడిని పిలుస్తూ, అతడిని ఆపడానికి కొంతవరకూ వెళ్ళినా కృష్ణ అప్పటికప్పుడే కనుచూపు మేరని దాటిపోవడం వల్ల లాభం లేకపోయింది. చేసేది లేక ఆలోచించుకుంటూ మూర్తి యింటి ముఖం పట్టేడు.

యీ విషమ పరిస్థితుల్లోనూ విపరీత స్వభావాల మధ్య తనేమవుతానో అన్న బెంగవల్ల రాధ

ఏడుపు తప్ప మరేం చేయలేకపోయింది. అటువంటి సమయంలో భర్త యింటికి వచ్చినట్టు కూడా గమనించలేదు. మూర్తి స్వయంగా ఆమె దగ్గిరకు వెళ్ళి -

"రాధా ? కారణం తెలియకుండా ఏడవడం చాలా తప్పు ! అసలు నీ మనసులో వున్న బాధకి అవసరం కనపడలేదు. దానికి నేనే కారణం అయితే నేను చాలా విచారిస్తున్నాను. నా జీవితం ఒకరిని కష్టపెట్టడానికే తప్పితే సుఖపెట్టడానికి కాదని అనుకోవలసి వస్తుంది" అని నెమ్మదిగా అన్నాడు.

అది విని రాధ గాభరాతో లేచి -

"అబ్బే, ఏమీ లేదండీ వొంట్లో బాగులేదు అంతే ! అటువంటి మాట లెందుకంటారు ! నా వలన మీ మనసు ఏం బాధ పడకుండా మీరు ఏ మాత్రం సుఖపడినా అదే పదివేలు" అని అంది చీరకొంగుతో కంటినీరు తుడుచుకుంటూ.

తరవాత మూర్తి కృష్ణని కలుసుకుందామని ఎంతో ప్రయత్నించాడు. ఊరంతా గాలించేడు గాని కృష్ణ జాడ లేదు.

ఒక వారం రోజులు గతించాక కృష్ణ వద్దనుండి శుభలేఖ వచ్చింది.

చంద్రశేఖరం వ్రాయు శుభలేఖార్థములు :

"స్వస్తిశ్రీ సర్వధారి నామ సం. మాఘ బ. అష్టమీ ఆదివారం సూర్యాస్తమయాది సు6.30 ని. లకు సరియగు రాత్రి గం.8.21 మనిట్లు కాగ అనూరాధా నక్షత్ర కన్యా లగ్నమున నా తమ్ముని కుమారుడు-

చి॥ కృష్ణకి సుబ్బారాయుడు బావగారి ద్వితీయ పుత్రిక చి॥సౌ॥ శారదని యిచ్చి తమ స్వగ్రామములో వివాహము జరుపుటకు పెద్దలు నిశ్చయించిరి గాన తచ్ఛుభ ముహూర్తమునకు తాము సకుటుంబ బంధు మిత్ర సహితముగా విచ్చేసి, వధూవరుల నాశీర్వదించి మత్కృత చందన తాంబూలాది సత్కారముల గైకొని నన్నానందపరచ వేడుచున్నాను".

అది చదువుకున్నాక ఇద్దరి మనసులూ తేలిక పడ్డాయి. మూర్తి మరేనాడూ ఆ విషయాలు ఎత్తలేదు. పెద్ద గండం గడిచినందుకు రాధ వేయి దేముళ్ళకు మొక్కింది. వారి సంసారంలో మబ్బులు తొలగిపోయాయి.

★ ★ ★

(ఆంధ్రప్రభ - 11-11-1953)